క్లుప్తంగా

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఆఫీసర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగరంలో ప్రతి వ్యాపారికి ట్రేడ్ లైసెన్స్ తప్పని సరిగా ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.సుధీర్‌కుమార్ హెచ్చరించారు. శ్రీకాకుళం నగరంలో పలు కూడళ్లలో షాపులను శుక్రవారం తనిఖీ చేశారు. ట్రేడ్‌లైసెన్స్ తీసుకుని నిబంధనల్ని పాటిస్తూ వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

డిజిటల్ అరెస్టులను నమ్మవద్దు



సెగిడిపేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జనార్దన

గార: ఫేక్ పోలీసు అధికారులు, స్టేషన్ ఫోటోలు పెట్టుకొని సైబర్ నేరగాళ్లు ప్రజలకు నేరుగా వీడియోకాల్ చేసి మోసగిస్తున్నారని, అటువంటి డిజిటల్ అరెస్టులను నమ్మవద్దని గార ఎస్ఐ ఆర్.జనార్దన అన్నారు. శుక్రవారం శ్రీకూర్మం పంచాయతీ సెగిడిపేట, మొగదాలపాడు, పేర్లవానిపేట గ్రామాల్లో 'సంకల్పం' పేరిట అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాల్లో ఈ తరహా ఘటనలు ఎక్కువగా జరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని కోరారు.

మోడల్ స్కూల్ అధ్యాపకుడి ప్రతిభ



తిరుపతిరావు

జి.సిగడాం: జి.సిగడాం మోడల్ స్కూల్లో తెలుగు అధ్యాపకుడిగా పని చేస్తున్న కోట తిరుపతిరావు(కేటీఆర్) ఇటీవల శ్రీశ్రీ కళావేదిక నిర్వహించిన కవితల పోటీల్లో ప్రతిభ కనబర్చారు. బాల్యం నీవు ఎక్కడ? అనే కవిత ఐదో స్థానంలో నిలవడంతో నిర్వాహకులు ప్రశంసాపత్రం పంపించారని శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతిరావును ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

పకడ్బందీగా ఈ-క్రాప్ నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ

జి.సిగడాం : రబీ సీజన్‌లో ప్రతి పంటకూ ఈ-క్రాప్ నమోదు చేయాలని జేడీ త్రినాథరావు సిబ్బందికి సూచించారు. శుక్రవారం మర్రివలసలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు దెబ్బతింటే ఈ-పంట నమోదైతే పరిహారం అందుతుందన్నారు. యాంత్రీకరణతో అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ యర్రా శారద, అగ్రికల్చర్ అసిస్టెంట్లు అలుగోలు లక్ష్మీనారాయణ, పాగిరి నారాయణరావు, ముంతా హరిష్, హరికృష్ణ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



గట్టెం రాములు (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: అరిణాం అక్కివలస గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గట్టెం రాములు (74) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన రెండు సార్లు సర్పంచ్‌గా వ్యవహరించారు. 1988 నుంచి 1995, 2005 నుంచి 2010 వరకు సర్పంచ్‌గా సేవలందించారు. ఈయన మృతి పట్ల పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలియజేశారు.

సత్యసాయి జయంతి వేడుకలకు ఏర్పాట్లు



విద్యుత్ అలంకరణలో న్యూకాలనీ సత్యసాయి మందిరం

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకల కోసం పెద్దమందిరం, న్యూకాలనీ, కలెక్టర్ బంగ్లా వద్ద గణేష్ మందిరం, బలగ హడ్కోకాలనీ, పీఎన్ కాలనీ, బ్యాంకర్స్ కాలనీ, హయాతినగరం తదితర మందిరాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. న్యూకాలనీ మందిరంలో 99 కేకుల ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. పెద్ద మందిరం వద్ద అన్నదానం నిర్వహణకు కూరగాయలు సిద్ధం చేశారు. మందిరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

ముద్దాడపేట రీచ్.. నిబంధనలు తూచ్!



ముద్దాడపేట రీచ్‌లో జేసీబీతో ఇసుక తవ్వకం

- ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు
- టెండర్లకు అనుమతి రాకుండానే తరలింపు
- 'హద్దు'లు మీరుతున్న వ్యాపారం
- పట్టించుకోని అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఇసుక పాలసీ కూటమి నాయకులకు కాసులు కురిపిస్తోంది. రీచ్‌లలో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపడుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా నిర్వాహకులు వెనుకడుగు వేయడం లేదు. ఎచ్చెర్ల మండలం పొన్నాడ పంచాయతీ ముద్దాడపేట ఇసుక రీచ్‌కు ప్రభుత్వం టెండర్లు ఖరారు చేసింది. అయితే ఇక్కడ తవ్వకాలకు ఇంకా అనుమతి ఇవ్వలేదు. ఈలోపే ఓ ఏజెన్సీ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుపుతున్నారు. పేరుకే ప్రభుత్వం టెం డర్లు ఖరారు చేసినా కూటమి నాయకుల కనుసన్నల్లో వ్యాపారం సాగుతోందనడానికి ఈ రీచే ఉదాహరణగా నిలుస్తోంది.



ముద్దాడపేట రీచ్‌లో యంత్రాలతో ఇసుక పోగులు వేస్తున్న దృశ్యం

యంత్రాలతో తవ్వకాలు..

ముద్దాడపేటలో బీ-2 కేటగిరి రీచ్ కింద టెండర్లు ఖరారు చేశారు. మరోపక్క టెండర్లు పిలిచిన రెండు ఎకరాల విస్తీర్ణంలో మాత్రమే తవ్వకాలు నిర్వహించాలి. ఇంకా హద్దులు నిర్ణయించలేదు. నిబంధనల ప్రకారం రీచ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఇంతవరకు ఏర్పాటు కాలేదు. మీటరు కంటే ఎక్కువ లోతు ఇసుక తవ్వకూడదు. అయినా జేసీబీ, పొక్లెయినర్, ఇతర యంత్రాలతో ఇష్టారాజ్యంగా లోతుగా తవ్వేస్తున్నారు. వాస్తవానికి ఇసుక తవ్వకాలకు యంత్రాలు వినియోగించకూడదు. ఇక్కడ మాత్రం ఆ నిబంధన అమలుకావడం లేదు. వేయింగ్ మిషన్ సైతం ఏర్పాటు చేయలేదు. మరోవైపు రీచ్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక పోగులు వేస్తున్నారు. పర్యావరణానికి హాని కలిగించేలా జరుగుతున్న ఇసుక తవ్వకాలపై స్థానికులు మండిపడుతున్నారు.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు..



ముద్దాడపేట ఇసుక రీచ్‌లో జరుగుతున్న అక్రమాలపై ఇటీవల గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదుచేశాను. నిబంధనల మేరకు హద్దులు నిర్ణయించి అందులోనే తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలి. ఇక్కడ పూర్తిస్థాయిలో నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం జరుగుతోంది.

– మొదలవలస చిరంజీవి, ఎచ్చెర్ల ఎంపీపీ

పరిశీలిస్తాం..

నిబంధనల మేరకే ఇసుక తవ్వకాలు సాగాలి. ముద్దాడపేట రీచ్‌లో ఇసుక తవ్వకాలకు ఇంకా అనుమతులు ఇవ్వలేదు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. నిబంధనలు అమలు చేయకపోతే టెండర్లు ఖరారు ఒప్పందం రద్దవుతుంది.

– సీహెచ్ మోహన్‌రావు, డీడీ మైన్స్

జీఓ 36 ప్రకారం జీతాలు చెల్లించాలి

- కమిషనర్‌కు వర్కర్స్ యూనియన్ వినతి



కమిషనర్‌కి వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జీఓనంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు చెల్లించాలని సీఐటీయూ టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం, ఇంజినీరింగ్ విభాగం జిల్లా అధ్యక్షులు రాణా శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్త రాయభార కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ వర్కర్స్ రెగ్యులేషన్ అండ్ అబాలిషన్ యాక్టు –1970 ప్రకారం ప్రమాదకర విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. పనిముట్లు, కిట్లు సకాలంలో అందించాలన్నారు. డిపార్ట్‌మెంట్ ద్వారా వాహనాలకు మరమ్మతులు చేయించాలని కోరారు. వారాంతపు, క్యాజువల్, జాతీయ సెలవులు అమలు చేయడం, పారిశుద్ధ్య కార్మికులకు రెండు జతల యూనిఫామ్, ఇతర సామగ్రి అందజేయాలని డిమాండ్ చేశారు. సిటీబస్ సర్వీసులు ఉన్న ప్రతి పట్టణంలో పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్ కార్మికులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. గత సమ్మె కాల ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షులు పి.త్రినాథరావు, పి.మణికంఠ, ఆర్.గిరిజాశంకర్, బి.వెంకటరమణ, కె.ఎల్లయ్యరెడ్డి, పేట శ్రీకాంత్, ఆర్.రమేష్ బాబు, పి సోమేష్, పి.శాంతి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సూర్యదర్శనం ప్రవచనాలు



సిద్ధమైన బాపూజీ కళామందిర్

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో రుషిపీఠం వ్యవస్థాపకులు సామవేదం షణ్ముఖ శర్మచే సూర్యదర్శనం అనే అంశంపై ఈ నెల 23 నుంచి 27 వరకు ప్రవచనాలు జరగనున్నాయి. సుమిత్రా కళాసమితి, ఉపనిషన్మందిరం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రవచనాల కోసం బాపూజీ కళామందిర్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున బయట ఎల్‌సీడీ స్క్రీన్ సైతం సిద్ధం చేశారు. ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ప్రవచనాలు జరుగుతాయని, భక్తులు అరగంట ముందుగా హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

భక్తిశ్రద్ధలతో మహా రుద్రాభిషేకాలు



శ్రీకాకుళం కల్చరల్ : అరసవల్లి బొంపాడ వీధిలోని సీతారామ మందిరంలో గౌరీ పరమేశ్వరస్వామికి శుక్రవారం మహారుద్రాభిషేకాలు జరిగాయి. అర్చకులు నేతేటి రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో దశవిధ హారతులు ఇచ్చి అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో మందిర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

మురుగు సమస్యకు మోక్షమెప్పుడో?

- అధ్వానంగా విలీన కాలనీలు
- అపార్ట్‌మెంట్ల వ్యర్థాలన్నీ రోడ్లపైకే
- పట్టించుకోని అధికారులు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో విలీనమైన పంచాయతీ గ్రామాలు (కాలనీలు)లో సమస్యలు తిష్టవేశాయి. అపార్ట్‌మెంట్ల నుంచి వస్తున్న వ్యర్థాలన్నీ రోడ్లపైకి, ఖాళీ స్థలాల్లో చేరి నెలల తరబడి నిలిచిపోతుండటంతో దుర్వాసన వెలువడుతోంది. దీంతో ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈగలు, దోమలు ఎక్కువై పరిసర ప్రాంతాల వారికి నిద్రాహారాలు లేకుండా చేస్తున్నాయి. చాపురం పంచాయతీ పరిధిలోని ధర్మశాస్తానగర్, కృష్ణానగర్, హోమియోనగర్, సత్యసాయినగర్, విజయనగర్ కాలనీ, ఎస్బీఐ స్టాఫ్ కాలనీ, భార్గవ్‌నగర్ కాలనీ, తిలక్‌నగర్ కాలనీ, శివరామ్‌నగర్ కాలనీ, కిష్టానగర్ కాలనీ, వంశధార నగర్ కాలనీ, డీసీసీబీ కాలనీ, గోవిందనగర్ కాలనీ, ఇందిరానగర్ కాలనీ, విశాఖ బి-కాలనీ, పెదపాడు రోడ్డు, శ్రీరామ్‌నగర్ కాలనీ, విశాఖ ఏ-కాలనీలో తదితర ప్రాంతాల్లో వ్యర్థాలు ఎక్కువై ఖాళీ స్థలాలన్నీ డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి.

పట్టించుకునేదెవరో?

ఒకప్పుడు పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య సమస్య తలెత్తితే సర్పంచ్‌కు ఫిర్యాదు చేసేవారు. వారు వెంటనే సమస్య పరిష్కరించేవారు. ఇప్పుడు కాలనీలన్నీ కార్పొరేషన్‌లోకి విలీనం కావడంతో పట్టించుకునే వారే కరువయ్యారు. అధికారులకు చెబితే చేస్తాం.. చూస్తాం అంటున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు వాపోతున్నారు.



అపార్ట్‌మెంట్ పక్కనే పేరుకుపోయిన వ్యర్థాలు, మురుగు

దుర్వాసన భరించలేం..

వంశధార నగర్ కాలనీ పరిసర ప్రాంతంలో నివాసముంటున్నాం. మా పక్కనే అపార్ట్‌మెంట్ల నుంచి వచ్చిన వ్యర్థాలు కాలనీ చుట్టుపక్కల ఖాళీ స్థలాల్లో నిల్వ ఉండిపోతున్నాయి. మురుగునీరు సైతం కాలువల్లోనే ఉండిపోతోంది. ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– ఆర్.చంద్రరావు, వంశధారనగర్ కాలనీ

సిబ్బందితో పనిచేయిస్తాం

ఇటీవల శానిటేషన్ సిబ్బంది ధర్నాలో ఉండటంతో కొన్ని కాలనీల్లో వ్యర్థాలు ఎక్కువైన విషయం వాస్తవమే. మున్సిపల్ శానిటేషన్ సిబ్బందితో ఆయా కాలనీల్లో వ్యర్థాలు తొలగిస్తాం. మురుగునీరు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– పి.వి.వి.డి.ప్రసాద్, కార్పొరేషన్ కమిషనర్

కొనసాగుతున్న ఇంటింటి సర్వే



ఎస్‌పీఆర్‌పురంలో సర్వే చేస్తున్న సిబ్బంది

జి.సిగడాం: గ్రామాల్లో కుటుంబ సమగ్ర సర్వే కొనసాగుతుంది. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంసభ్యుల వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రస్తుతం కోతల సమయం సందర్భంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జనం గ్రామాల్లో అందుబాటులో ఉండటం లేదు. దీంతో సర్వే సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు.

శతశాతం ఇళ్ల సర్వే పూర్తి చేయాలి

గార: ఇళ్ల సర్వేను శతశాతం పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా శిశు సంక్షేమశాఖ పీడీ బి.శాంతిశ్రీ అన్నారు. శుక్రవారం దీపావళిలో జరుగుతున్న జియో ట్యాగింగ్ సర్వేను పరిశీలించారు. పక్కా సమాచారం సేకరించి నమోదు చేయాలన్నారు. అనంతరం శ్రీకూర్మం పంచాయతీ రాళ్లపేట లేఅవుట్‌ను పరిశీలించి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శిమ్మ రామ్మోహనరావు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

24న పట్టుశాలి వనసమారాధన

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తోటపాలెం-పాన్నాడ రోడ్డులోని వెంకన్నగారిపేట తోటలో ఈ నెల 24న పట్టుశాలి కులస్తుల వనసమారాధన నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు గుంటుకు చంద్రశేఖర్, కార్యదర్శి పేకల రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుశాలి కులస్తులంతా హాజరుకావాలని కోరారు.

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సందీప్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్ అన్నారు. చిలకపాలెంలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గంజాయి అమ్మకాలు జరగకుండా ప్రత్యేక దృష్టిపెట్టినట్లు చెప్పారు. గంజాయి అమ్మినా, వినియోగించినా, బహిరంగంగా మద్యం తాగినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వెంకన్నకు పంచామృతాభిషేకాలు



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో శివబాలాజీ ఆలయంలో కార్తీక శుక్రవారం సందర్భంగా పంచామృతాభిషేకాలు జరిగాయి. అర్చకులు గోపినంబాళ్ల సీతారామాచార్యులు, సత్యకూర్మాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

స్వామికి అభిషేకం చేస్తున్న దృశ్యం

పేదలకు దుస్తుల వితరణ



భగవాన్ సత్యసాయిబాబా జయంతి వేడుకల్లో భాగంగా ముద్దాడ పంచాయతీ కొయ్యవానిపేటలో శుక్రవారం పీఎన్ కాలనీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో పేదలు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. గ్రామసేవలో భాగంగా జిల్లా అధ్యక్షులు సూరరామచంద్రరావు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నర్సింహమూర్తి చేతుల మీదుగా 100 మందికి వీటిని అందజేశారు. అనంతరం నైతిక విలువలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి ప్రతినిధులు పాల్గొన్నారు. – ఎచ్చెర్ల క్యాంపస్

కుండీలు సరే.. మొక్కలేవీ?



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ అండ్ సైన్స్ కళాశాలలో మొక్కల పెంపకం కోసం సిమ్మెంట్ కుండీలు ఏర్పాటు చేశారు. మొక్కలు నిర్వహణ లేక ఎండిపోవడంతో ప్రస్తుతం కుండీలు నిరుపయోగంగా మారాయి. ఏవైనా ఆధీకృత సంస్థలు తనిఖీలకు వస్తేనే మొక్కలను అప్పటికప్పుడు ఏర్పాటు చేస్తున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

సంతోషిమాతకు అభిషేకాలు



పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో విశేష కుంకుమ పూజలు చేసి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

– శ్రీకాకుళం కల్చరల్

అమ్మవారికి అఖండ హారతి



ఎచ్చెర్ల మండలం కొంచాలకూర్మయ్యపేటలోని దేవీపీఠంలో కార్తీక శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి బాలభాస్కర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించి అఖండ హారతి ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యతో హాజరై శ్రీచక్రాలకు పూజలు చేశారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

సాక్షి ఎఫెక్ట్

పరాంకుశనగర్‌కు రోడ్డు



సీసీ రోడ్డు వేసిన దృశ్యం

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం ఎంపీడీఓ కార్యాలయం మీదుగా వెళ్లే పరాంకుశనగర్‌కు ఎట్టకేలకు రోడ్డు సమస్య తీరింది. రోడ్డు అంతా గతుకుల మయం శీర్షికన ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సీసీ రోడ్డు నిర్మించడంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తీరిన రహదారి సమస్య

జి.సిగడాం: శ్రీకాకుళం-రాజాం ప్రధాన రహదారిలో వాండ్రంగి రైల్వే వంతెనపై భారీగా గోతులు ఏర్పడటంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయమై ఇటీవల సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు గోతులు పూడ్చి బీటీ రోడ్డు వేశారు.



బీటీ రోడ్డు వేసిన దృశ్యం

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీ కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం: భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వక్తలు పేర్కొన్నారు. నగరంలో పెద్ద మసీదు వద్ద రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 26న జరగనున్న రాజ్యాంగ దినోత్సవ ర్యాలీ పురస్కరించుకుని శుక్రవారం కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సామ్నా రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్, మోహిబుల్లా ఖాన్, సలీం ఖాన్, రషీద్, షాన్ మహాలక్ష్మి, రాకోటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

25న సామూహిక లక్షవత్తుల దీపారాధన

శ్రీకాకళం కల్చరల్: నగరంలోని బొంతావారి వీధిలో శ్రీకృష్ణార్జున మందిరం ఆధ్వర్యంలో ఈ నెల 25న సాయంత్రం 3 గంటల నుంచి ఇందిరా విజ్ఞాన్‌భవన్‌లో సాముహిక లక్ష వత్తుల దీపారాధన నిర్వహిస్తున్నట్లు మిమిక్రీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్తిక మాసం ఆఖరి సోమవారం పురస్కరించుకుని మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాలతో అభిషేకాలు, రుద్రహోమం, 101 మంది మహిళలు, కన్యలతో లక్షవత్తుల దీపారాధనలు జరుగుతాయని వివరించారు. పూర్తి వివరాలకు 9441072762 నంబరును సంప్రదించాలని కోరారు.